క్లుప్తంగా

'అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు'

ధన్వాడ: నారాయణపేట జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకపోతున్నాయని ధన్వాడ సర్పంచ్ అమరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పనిగట్టుకుని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వాల పాలనలో, బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఎలా ఉన్నాయో బేరిజు వేసుకోవాలన్నారు.

నిధులు ఇవ్వండి

మక్తల్: అంకేన్‌పల్లి, భుగువాన్‌పల్లి గ్రామాలకు 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలని సర్పంచ్‌లు లక్ష్మణ్, వెంకట్‌రాములు అన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడారు. తాగునీటి వసతి, రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం చేయడానికి నిధులు అవసరం ఉన్నాయని అన్నారు. మంజూరు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరీక్షలు ప్రారంభం

నారాయణపేట రూరల్ : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు మొదటి సెమ్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో తొలిరోజు బీఏ, బీకామ్, బీఎస్సీ విద్యార్థులకు పరీక్షను నిర్వహించారు. 91 హాజరుశాతం నమోదైందని కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ప్రత్యేక పరిశీలకులు దత్తాత్రేయా తనిఖీచేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



నారాయణపేట రూరల్ : విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయ సమస్యలపై పూర్తి అవగాహన కల్గిన వ్యక్తులను మండలికి పంపిస్తే తగిన న్యాయం జరుగుతుందని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా విశ్రాంత డీఈఓ, బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాలో పర్యటించి పలువురు ఉపాధ్యాయుల ఇంటికి వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల కాలంగా విద్యారంగంలో సేవ చేసిన అనుభవం, ఎంతో మంది టీచర్ల సమస్యల పరిష్కారంలో పాలుపంచుకున్నానని, ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు విద్యాసంస్థల మంచిచెడులపై పూర్తి అవగాహన ఉందన్నారు. టీచర్లకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామన్నారు. భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేసి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, 317జీఓ బాధిత టీచర్లను తగిన పరిష్కారం చూయించాలని డిమాండ్ చేశారు. బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణుడు, ఉపాధ్యక్షులు రాములు, పాలమూర్ అధ్యక్ష, కారదర్శులు గురుప్రసాద్, రాఘవేందర్, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర సహ అధ్యక్షులు సత్యనారాయణకాంబ్లే, నాయకులు నగేష్, అనిల్, రాము, గోవింద్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు సరికాదు

నారాయణపేట: రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన ఇబ్బంది కలిస్తూ అప్రకటితంగా విద్యుత్ కోత చేయడం సరికాదని, ఎత్తివేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రైతాంగానికి వరి నాట్లు వేసుకోవడం, చేతికి వచ్చిన వేరుశనగ పంటను తీయడం కోసం అత్యవసరంగా నీటి వసతి అవసరముందన్నారు. వెంటనే కోతలను నిలిపివేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

కబ్జాలపై విచారణ చేయాలి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని దాదాపు 1500 మంది ప్రైవేట్ ప్లాట్ల సొంతదారులను, అప్పటి ప్రభుత్వ హయాంలో మైనార్టీ కాలనీ, ఎస్సీకాలనీ పేరిట ప్లాట్లు పొందిన లబ్ధిదారులను కబ్జాలతో ఇబ్బందులు పెడుతున్నారని బీసీసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాల్‌రాజ్‌యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడమే కాకుండా ప్రైవేట్ పట్టా భూముల్లో ప్లాట్ల సొంతదారులను, మైనార్టీ, ఎస్సీ కాలనీల లబ్ధిదారులకు వారి వారి పట్టాలను రక్షించాడానికి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఘంటసాలకు నివాళి

నారాయణపేట రూరల్ : చలనచిత్ర పరిశ్రమలో ప్రత్యేకత సంతరించుకున్న గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి శనివారం బాలకేంద్రంలో నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాఫ్‌నాగరాజు రూ.30వేల విలువైన వీణ బహూకరించారు. ఎస్పీ బాలు ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, టీవీ, రేడియో గాయకులు సంఘ నర్సింహులు, వసంత్, నాగరాజు, నర్సింహులు, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

- ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



జిల్లా కేంద్రంలోని యాద్గీర్ ప్రధాన రహదారిలో..



జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్ నుంచి కొండారెడ్డిపల్లి చెరువు ప్రధాన రహదారిలో..

నారాయణపేట టౌన్ : పేట జిల్లాలో ఆయా గ్రామాలు, పట్టణాలకు వెళ్లే రహదారులు ప్రమాదకర మలుపులతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆయా చోట్ల కనీసం సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు సందర్భాలలో జరిగిన ప్రమాదాలలో ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని ఆయా ప్రాంతాల స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

- నారాయణపేట నుంచి కొండారెడ్డి రోడ్డు మార్గంలో ఐదుకు పైగా ప్రమాదకర మలుపులు ఉన్నాయి.
- దీంతో ఈ దారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.
- కొండారెడ్డిపల్లి నుంచి దామరగిద్ద రోడ్డు మార్గంలో మెట్టుగడ్డ ఆంజనేయ దేవాలయం వరకు ఉన్న మలుపులతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో యాద్గీర్ రోడ్, లోకాయపల్లి రోడ్డులో మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డు సైతం ఏర్పాటు చేయలేదు.

మద్దూర్ నుంచి పేట వెళ్లే దారిలో..

మద్దూరు: పెదిరిపాడ్ మీదుగా మద్దూరు నుంచి నారాయణపేట వెళ్లే రోడ్డులో చెరువు కట్ట దగ్గర ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఓ సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నాళ్ల క్రితం ఒత్తుగుండ్ల గ్రామానికి చెందిన చాకలి రాములు బైక్ అదుపుతప్పి ఇక్కడే పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. చెన్నారెడ్డిపల్లికి చెందిన చెంద్రప్ప బైక్‌పై వస్తూ అదుపుతప్పి పడిపోయి గాయాలపాలయ్యాడు. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, కల్వర్టుల నిర్మాణం వంటివి చేపట్టాలని కోరుతున్నారు.



పెదిరిపాడ్ చెరువు కట్ట వద్ద పరిస్థితి ఇలా..

గిరిజనులు ఐక్యంగా ఉండాలి

నారాయణపేట రూరల్ : బంజారాల ఆరాధ్యదైవం శ్రీశ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేద్దామని గిరిజన విద్యార్థిసమైక్య నాయకులు సంతోష్ రాథోడ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజనులు ఐక్యతతో ఉండి అభివృద్ధి చెందాలన్నారు. సేవాలాల్ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10గంటలకు కొండారెడ్డిపల్లి చెరువు నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని, కలెక్టరేట్ వరకు కొనసాగుతుందన్నారు. పెద్ద ఎత్తున హాజరై విజవయవంతం చేయాలన్నారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం



నారాయణపేట రూరల్ : మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని గుట్టపై పునర్ నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయానికి స్థానిక వ్యాపారి కోమటి బాలవర్ధన్ కుటుంబ సభ్యులు రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు ఆయన సోదరుడు సత్యనారాయణశెట్టి రూ.51వేలు, అబ్దుల్లాపురం నివాసి కోమటి చంద్రశేఖర్ రూ.55వేలను శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభావతి, ఎంపీటీసీ జయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'గడినాడ' విద్యార్థులపై చిన్నచూపు



మాట్లాడుతున్న అమర్‌కుమార్ దీక్షిత్

కృష్ణా: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 24,000ల మంది వరకు గడినాడ కన్నడ విద్యార్థులు ఉన్నారని, వారు ఉన్నత విద్యాభ్యాసంకోసం కర్ణాటకకు వచ్చినప్పుడు అక్కడి ప్రభుత్వం హాస్టల్ సౌకర్యం కల్పించడం లేదని సంఘం అధ్యక్షుడు అమర్‌కుమార్ దీక్షిత్ ఆరోపించారు. శనివారం రాయచూర్ పట్టణంలో నిర్వహించిన గడినాడ కన్నడ విద్యాభివృద్ధి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా కర్ణాటక ప్రభుత్వం గడినాడ కన్నడ విద్యార్థులను చిన్నచూపు చూస్తోందని అన్నారు. కర్ణాటక విద్యార్థులకు ఏ విధంగా అయితే ప్రభుత్వం సౌకర్యాలు కలిస్తున్నదో అదేవిధంగా తక్షణమే గడినాడ విద్యార్థులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు నిజామూద్దీన్, నాగరాజ్, నాగభూషణం, ఈరణ్ణ, శివరాజ్, సోమనాథ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించండి

మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామానికి రెవెన్యూ గ్రామంగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు దండు శ్రీనివాస్‌రెడ్డి, దామోందర్‌రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పంపల్లికి చెందిన రైతుల భూములు మందిపల్లి, మరికల్, కిష్టాపూర్, పస్పుల, మాధవరం గ్రామాల శివారులో ఉండటం వల్ల పంటరుణాలు, ఆర్ఓఆర్‌లు, పహాణిలు తీసుకోవాలంటే అధికారుల చుట్టూ తిరగలేకపాతున్నామని వాపోయారు.

పాదయాత్రగా తరలిన భక్తులు



ధన్వాడ: మండల కేంద్రంలోని శివమాలాధారులు పాదయాత్రగా శ్రీశైలానికి తరలి వెళ్లారు. అంతకు ముందు స్థానిక ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి ఇరుముడులు ధరించారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ



మక్తల్: అంతర్జాతీయ కరాటే చాంపియన్‌లో మక్తల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరాటే వ్యవస్థాపకుడు సాలబిన్‌ఉమర్ తెలిపారు. ఏపీలో జరుగుతున్న పోటీల్లో పతకాలు సాధించారని పేర్కొన్నారు. మాస్టర్లు అంబ్రేస్, అంజన్‌ప్రసాద్, సలీం, విజ య్ కృష్ణ, అర్పత్, మోసి, ఫాహిమోద్దీన్ అభినందించారు.

'మాణిక్‌రెడ్డికి మద్దతు ఇవ్వండి'

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాపన్న గారి మాణిక్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ కోరారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని, టీచర్ల వాణి బలంగా మండలిలో వినిపించడానికి మాణిక్‌రెడ్డికి ఓటు వేయాలన్నారు. శివరాములు, బాలాజీ, వెంకటస్వామి, రాజేష్, గోవింద్, రవికుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానిది సంక్షేమ బడ్జెట్

నారాయణపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ బడ్జెట్ అని జాతీయ పన్నుల జాతీయ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి బి.శాంతికుమార్ అన్నారు. శనివారం బడ్జెట్ అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లా కో ఆర్డినేటర్ కేంద్ర సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ అధ్యక్షత వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు పి.శ్రీనివాసులు, కో కన్వీనర్ భరత్‌కుమార్, న్యాయవాదులు, మేధావులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వాహించారు. విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఎస్ఓగా మహాలక్ష్మి, జిల్లా కలెక్టర్‌గా బి రేణుక, జిల్లా విద్యాధికారిగా రాధిక, జీసీడీఓగా శిరిష తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల ఎస్ఓ రాధిక మాట్లాడుతూ.. ఉన్నత విలువలను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన చిన్నారులు చాలా చక్కగా వి . దులు నిర్వహించారని అన్నారు. ఉపాధ్యాయులు రాజేంద్రమణి, లక్ష్మి, ఉమాదేవి, అనిత, జ్యోతిప్రభ, వనిత, జ్యోతి, విజేత, పుష్పలత పాల్గొన్నారు.

'హక్కుల పరిరక్షణకు పోరాడుదాం'



బిజ్వార్‌లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఊట్కూరు: ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేద్దామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం బిజ్వార్‌లోని గ్రామిక భవన్‌లో మండల మహాసభలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఈశ్వర్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మోదీ ప్రభుత్వం కార్పోరేట్లకు దాసోహం అయిందని ఆరోపించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, సలీం, కాశేశ్వర్, రాము, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కంచె ఏర్పాటు చేయండి



మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరాను అందించే ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. కంచే ఏర్పాటు చేయకపోవడంతో గతంతో మూగజీవులు అనేక సార్లు మృతువాత పడ్డాయి. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. విషయంపై సంబంధింత అధికారులకు పలుమార్లు విన్నవించామని, అయినా నిమ్మకునీరెత్తనట్లు వ్యవరిస్తున్నారని వాపోతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగముందే కంచె ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నర్వ: ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై శనివారం మండల కేంద్రంలోని ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు గడ్డం నర్సిములు, విండో వైస్ చైర్మెన్ లక్ష్మన్న, రైతు సమితి మండల కోఆర్డీనేటర్ చిన్నయ్య, ఎంపీటీసీ నీరజ్, నాయకులు సుధీర్, అయ్యన్న, డీలర్ హన్మంతు, ఉమాపతి, వెంకటయ్య, భగవంతు, రాములు, వెంకటేష్, రాజు, గోవిందు, అశోక్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్ అడుగుజాడల్లో నడుద్దాం



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణపేట రూరల్ : జనసంఘ్ వ్యవస్థాపకులు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త నడిచి ఆదర్శంగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో దీన్‌దయాల్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌వర్ధన్, మదన్, నందునామాజీ, రఘువీర్, మల్లేష్, సత్యరఘుపాల్, చలపతి పాల్గొన్నారు.

నర్వ: ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించి, అంత్యోదయ విధాన్ని రూపొందించి, ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా బీజేపీకి పటిష్ట పునాదులు వేసిన గొప్పనేత దీన్‌దయాల్ అని బీజేపీ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం నర్వ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి కుర్వసత్యం, నాయకులు అయ్యన్న, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా, ఫజల్, సర్పంచు సంధ్య, ఆంజనేయులు, ఉప సర్పంచు నర్సింహారెడ్డి, నాగిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డీజే రవి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామంలోని శివసాయిబాబా ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి, నియోజకవర్గ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించిన నంది, శివలింగం, నవగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి. నర్సిములు, డి.కృష్ణారెడ్డి, రవికుమార్, మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్, బోల్బండ వెంకటేష్, శరణ్, లంకాల్ మహేష్, వివేక్‌వర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రామన్‌గౌడ్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ రద్దు పోరాటానికి మద్దతు



మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నర్వ: ఇథనాల్ కంపెనీ రద్దు కోసం చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి పేర్కొన్నారని, ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. శనివారం చిత్తనూర్ నుంచి మొదలైన పాదయాత్ర దమాగ్నపూర్ మీదుగా పర్కాపురానికి చేరుకుంది. అక్కడ ఉన్న మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డిని కలిసి కంపెనీ వల్ల కలిగే నష్టాలను వ్యతిరేక పోరాట సమితి నాయకులు వివరించారు. కార్యక్రమంలో మహిళలు, చిత్తనూర్ యువక మండలి, ఎక్లాస్‌పూర్ యువక మండలి వ్యతిరేక పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైయినేజీ

- నిధులు ఉన్నా మరమ్మతులు చేయని అధికారులు
- ఇళ్లమధ్య నీరు నిలవడంతో తప్పని దోమల బెడద
- డెంగ్యూ బారిన పడుతున్న చిన్నారులు



సరస్వతి కాలనీలో పరిస్థితి ఇలా..

మరికల్: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డు పక్కన ఉన్న సరస్వతి కాలనీలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతులు చేయడానికి నిధులు ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. కాలనీలోని ఫిల్టర్ వాటర్‌కు సంబంధించిన వృథా నీరు డ్రైయినేజీలు సరిగా లేకపోవడంతో ఇళ్ల మధ్యన నిలిచి దోమలకు నిలయంగా మారుతోంది. దీంతో చిన్నారులు డెంగ్యూ బారిన పడుతున్నారు. విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, వ్యాధుల వల్ల చిన్నారులకు ఎమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ డ్రైనేజీ నిర్మించాలని ఐదేళ్ల క్రితం నిధులు మంజూరు అయ్యాయని, పనులు చేయాలని పలుమార్లు సర్పంచ్‌కు తెలిపామని అయిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

నాసిరకంగా బీటీరోడ్డు నిర్మాణం

- వేసిన నాలుగురోజులకే పగుళ్లు

మాగనూర్: మాగనూర్ మండల కేంద్రంలో 167వ అంతర్‌రాష్ట్ర రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగులైన్ల రహదారి నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆరోపిస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నాసిరకంగా పనులు చేయిస్తున్నారని అంటున్నారు. బీటీరోడ్డు వేసి కనీసం నాలుగు రోజులు కూడా గడవలేదని, అప్పుడే దానిపై పగుళ్లు వచ్చాయని, గుంతలు ఏర్పడ్డాయని అంటున్నారు. హైవే కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని ఇలా పనులు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయడంతో పాటు అక్కడక్కడ నిర్లక్ష్యంగా వదిలేసిన రోడ్డు నిర్మాణం కూడా పూర్తి చేయాలని కోరుతున్నారు.



ప్రధాన చౌరస్తాలో పగుళ్లు వచ్చిన రోడ్డు